# సిరిమువ్వలు

- విన్నకోట సుశీలాదేవి

రాత్రి తొమ్మిది గంటలయింది!

మహిళా మండలి మీటింగు ముగించుకుని ఇంటి ముందు కారు దిగింది విజయ :

కారు డోరు వేస్తుండగా ప్రెసిడెంటు గుర్తు చేసింది 'విజయగారూ... వచ్చేవారం ఢిల్లీ మీటింగుకు మనందరికీ ట్రైను టిక్కెట్లు రేపే బుక్ చేయించండి. మళ్లీ దొరకవు.'

'అలాగే... అలాగే...' అంటూ గబగబా ముందుకు నడిచింది విజయ.

ఇల్లంతా చీకటిగా వుంది. కరెంటు లేదా అనుకుంటూ మెట్లెక్కి లోపలికి వచ్చింది. హాల్లో సోఫాలో కూర్చుని సీరియస్‌గా టీ.వి చూస్తున్నాడు భర్త రమణమూర్తి.

'అదేమిటండీ..... లైటు వేసుకోలేదే?' అంటూ స్విచ వేసింది. తెల్లనీ ట్యూబులైటు వెలుగు హాలంతా పరుచుకుంది.

రమణమూర్తి తల తిప్పి విజయవైపు కోపంగా చూశాడు.

నువ్వు వేస్తేగానీ లైట్లు వెలగవుట.... హూ.... ఇప్పటికైనా ఇల్లు గుర్తొచ్చినందుకు చాలా సంతోషం.'

'పిల్లలేరీ?'

'నాకేం తెలుసు. వాళ్లని నీతోపాటు తీసుకెళ్లావనుకున్నాను.'

'చాల్లెండి హాస్యం. రవీ..... స్వప్నా!' అంటూ బెడ్ రూములో కొచ్చింది. పిల్లలు స్కూలు డ్రెస్సు అయినా విప్పకుండా మంచం మీద పడుకుని నిద్రపోతున్నారు.



వాళ్ళనాస్థితిలో చూసి ఎంతో బాధపడిపోయింది విజయ.

'ఆయన ఆఫీసునుండి వచ్చినప్పట్నించీ ఆ వెధవ టీ.వి పెట్టుకుని కూర్చోకపోతే వీళ్ల సంగతి చూడొచ్చుగా!' అనుకుంటూ పిల్లల్ని లేపింది.

వాళ్లు నిద్రలేచి తల్లిని చూస్తూనే -

'అమ్మా! ఆకలి' అంటూ ఏడవసాగారు.

'అదేమిటి! లక్ష్మి మీకు అన్నం పెట్టలేదా?'

'ఏమో మాకు కనబడలా!' అన్నారు.

విజయ వంటింట్లోకెళ్లింది. సింకునిండా అంట్లు స్టవ్ నిండా పాలు ఒలికిపోయి వున్నాయి. పంచదార డబ్బా క్రిందపడిపోయి. ఇల్లంతా పంచదారతో నిండిపోయింది.

ఆదృశ్యం చూడగానే విజయకు నవనాడులూ కృంగిపోయినట్లంది. అయితే ఈ పూట కూడా లక్ష్మి రాలేదన్నమాట అనుకుంది. చెప్పరాని నీరసం ఆవహించింది.

'విజయా! తలనొప్పిగా వుంది. ముందు ఒక కప్పు కాఫీ పట్టుకురా.' అంటూ హాల్లోంచి కేకపెట్టాడు రమణమూర్తి.

పిల్లలు తల్లి వెనకాలే వచ్చి -

'అమ్మా! ఆకలే!' అంటూ ఏడవసాగారు.

విజయకు చిర్రెత్తుకొచ్చింది.

'ఆకలి అన్నారంటే చంపేస్తా' అంటూ అరిచింది రమణమూర్తి, విసురుగా వచ్చాడు.

'నేను కాఫీ అడిగాను నన్ను కూడా చంపుతావా? చంపు....' అన్నాడు కోపంగా.

'నేను మిమ్మల్ని అనలేదు.'

'ఇవ్వాళ పిల్లల్ని అన్నావు, రేపు నన్నూ అంటావే, నీకు బయటి మీటింగులే కానీ ఇల్లు గురించి పట్టించుకునే టైముంటేగా... మధ్యాహ్నం వెళ్లావు మీటింగుందని. ఇప్పుడా రావడం... మొగుడు ఆఫీసు నుండి అలిసి వస్తాడు. పిల్లలు స్కూలు నుండి ఆకలితో వస్తారు వాళ్ల అవసరాలు తీర్చాలనే జ్ఞానం వుందా నీకు. షికార్లు - మీటింగులు ఇవే ముఖ్యం నీకు. ఇంక మొగుడు, పిల్లలు ఎందుకు? అయినా రాత్రిక్కూడా అక్కడే వుండకపోయావా? ఎందుకొచ్చావ్?' పిచ్చిగా అరవసాగాడు రమణ మూర్తి.

విజయ ఆ మాటల్తో మరింత రెచ్చిపోయింది.